Website: www.subhatelangana.in

సోమవారం
9 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 123
పేజీలు : 6
వెల : 3/-

RNI-TELTEL/2017/72695

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar




## గుజరాత్ గ్రామాల్లో కలకలం

- పిల్లలతో సహా 12 మంది తీవ్ర జ్వరంతో మృతి
- జ్వరం, జలుబు, దగ్గు, న్యుమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో రోగులు
- రోగం ఏమిటన్నది డాక్టర్లు సైతం గుర్తించలేకపోతున్నట్లు ఆ గ్రామస్తులు ఆరోపణ

# కూల్చివేత.. గుండెకోత



"
- తెల్లారకముందే బస్తీలపై బుల్డోజర్లతో హైడ్రా దాడి
- గంటల వ్యవధిలోనే రోడ్డుపాలైన బతుకులు
- పండుగపూట పేదల ఇండ్ల కూల్చివేత
- సర్కారుపై దుమ్మెత్తి పోసిన బాధితులు
- చంటి పిల్లలతో వర్షంలోనే కుటుంబాలు
- కండ్ల ముందే గూడు చెదిరిన పేదలు
- కిరోసిన్‌తో పలువురి ఆత్మహత్యాయత్నం
- కనికరం లేని కాంగ్రెస్ సర్కారు: కేటీఆర్

శుభ తెలంగాణ హైదరాబాద్

వినాయకుడి పూజ చేసుకుని హాయిగా ని ద్రించిన ఆ కుటుంబాలకు మరికొన్ని గంటల్లోనే హైడ్రా రూపం లో గండం వచ్చి పడింది. ప్రజాపాలనలో సామాన్యుడి గూడుపై సర్కారు దాడి మొదలైంది. తెల్లవారుజామునే నిద్రలేవకముందే ఇండ్లపై బుల్డోజర్లతో దాడులు చేయిస్తూ ప్రభుత్వం హైడ్రామాలు చేస్తోం ది. ప్రభుత్వం, హైడ్రాపై బాధితులు తిరగబడుతూ ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం జరుగుతున్న వాటిపైనే ముందుగా చర్యలు తీసుకుంటామని హైడ్రా చెబుతూనే ఇండ్లలో నివాసముంటున్న వారిపై విరుచుపడుతున్నది. కూల్చివేతల్లో హైడ్రా ప్రదర్శిస్తున్న ద్వంద్వ నీతిపై నగర ప్రజలు మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిసరాలలో ఉద్రిక్తతల నడుమ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మల్లంపేట్‌లోని కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో లక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థ ఎఫ్‌టీఎల్, బపర్ జోన్‌లో నిర్మించిన 13 విల్లాలను కూల్చేశారు. భారీ పోలీసుల బందోబస్తు నడుమ మాదాపూర్, దుండిగల్‌లోని సున్నం చెరువు, కత్వ ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న డ్రైవ్ ఇన్, రెండు బహుళ అంతస్తుల నిర్మాణాలతో పాటు పొట్టకూటి కోసం వచ్చిన సామాన్యుల షెడ్‌లను కూడా హైడ్రా కూల్చేసింది. - మిగతా3లో



## ఈడీ తనిఖీలు.. రూ. 6.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత

- భారీ నగదు, పలు డాక్యుమెంట్లను సైతం ఈడీ అధికారుల స్వాధీనం
- ఢిల్లీ వేదికగా జరిగే తమ విచారణకు హాజరు కావాలని స్వపన్‌కు సమన్లు జారీ


# కొండంత సాయం

- కాంగ్రెస్ కీలక నిర్ణయం..
- వరద బాధితులకు ఊహించని విరాళం
- భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మంను ఆదుకోవడానికి కాంగ్రెస్ కొండంత సాయం
- వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధుల నిర్ణయం
- పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలు కార్పోరేషన్ల చైర్మన్లు కూడా



శుభ తెలంగాణ హైదరాబాద్/ఖమ్మం

ఎగిరిపోయిన పైకప్పులు, కూలిన గోడలు, కొట్టుకుపోయిన ఇళ్లు..! ఖమ్మంలో మున్నేరు విలయంతో ఎటుచూసినా విషాద గాథలే..! ఏ వీధిలో తిరగాలన్నా అంతా బురదే..! ఏ ఇంట్లో చూసినా మట్టికొట్టుకున్న వస్తువులు, దుస్తులే..! కొందరికి ఇవీ లేవు. ఆయా ప్రాంతాల్లో ఏ ఇల్లాలిని కదిలించినా కన్నీరే. మున్నేరు ఉగ్రరూపం దాల్చి 36 అడుగుల మేర ప్రవహించడంతో నది తీరాన ఉన్న ప్రాంతాల్లో వేల ఆవాసాలు నీట మునిగాయి. ఇలా ఒకటా రెండా ఎటు చూసినా హృదయాలను కదిలించే దృశ్యాలే!. ఇప్పుడిప్పుడే అటు మున్నేరు కాస్త శాంతించగా.. ఇటు ఖమ్మం నగర వాసులు - మిగతా3లో



## ఫోర్త్‌సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

- ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేస్తాం
- కొందరు జర్నలిస్టుల తీరుతో అందరికీ చెడ్డపేరు
- పేట్‌బషీర్‌బాగ్‌లో కేటాయించిన 38 ఎకరాల భూమి జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

త్వరలో నిర్మించనున్న ఫోర్త్‌సిటీలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇండ్ల స్థలాల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని కోరారు. అర్హులైన వారిని ఫ్యూచర్‌సిటీలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఆదివారం ఆయన రవీంద్రభారతిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో - మిగతా3లో



## కూల్చి వేతలకు చెక్ పెట్టనుందా?

- ప్రజా వ్యతిరేకతతో హైడ్రా కీలక ప్రకటన..
- ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం ఇంట్లోని సమాను తీసుకునే సమయం ఇవ్వకుండా ఇండ్లు కూల్చివేస్తుండటంతో పేదలు, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత
- ఆల్రెడీ నివాసం ఉంటున్న గృహాలను కూల్చం. కొత్త నిర్మాణాలు మాత్రమే కూలుస్తున్నామని వివరణ
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు స్థలాలు ఇకపై కొనవద్దని హైడ్రా సూచించింది.

# కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు

- రేవంత్‌ను చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయి..
- హరీశ్‌రావు సైటెర్లు
- ఈ 9 నెలల కాలంలోనే 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు
- నీ పాలన ఎలా ఉందంటే ఎన్నికల ముందు ఒక మాట, కుర్చీ ఎక్కిన తర్వాత ఒక మాట




శుభ తెలంగాణ హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని, ఈ 9 నెలల కాలంలోనే 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డిని చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పాలనలో ఈ రోజు వరకు 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. లిస్ట్ అడిగితే గంటలో పంపించాను.. అయినా ఆదుకోలేదు.. స్పందించలేదు. నీ పాలన ఎలా ఉందంటే ఎన్నికల ముందు ఒక మాట, కుర్చీ ఎక్కిన తర్వాత ఒక మాట, బడ్జెట్‌లో ఒక మాట, పార్లమెంట్ ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ఒక మాట.. పూటకో మాట మాట్లాడుతున్నావ్. పొద్దు తిరుగుడు పువ్వు కంటే వేగంగా మారుతున్నవ్. ఊసరవెల్లులు కూడా నిన్ను చూసి సిగ్గుపడుతున్నాయి. ఎన్నికల ముందు ఏం చెప్పవ్.. అప్పులు తెచ్చుకోండి డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా అన్నావ్.. కుటుంబానికి ఒక్కరికే చేస్తా అని చెప్పలేదు కదా..? అని హరీశ్‌రావు నిలదీశారు. ఎన్నికలు అయిపోయాక మాట్లాడుతూ.. ఒక సంవత్సరం కడుపు కట్టుకుంటే రూ. 49 వేల కోట్ల రుణాలు మాఫీ చేసేస్తా అన్నవ్. మరి ఎందుకు కోతలు పెడుతున్నావ్.. కేబినెట్ మీటింగ్ అయ్యాక నీవే ప్రెస్ మీట్ పెట్టి రూ. 31వేల కోట్లు 41 లక్షల మంది రైతులకు మాఫీ చేస్తా అన్నవ్. బడ్జెట్‌లో చూస్తే రూ. 26 లక్షల కోట్లు - మిగతా3లో

# అందరి టార్గెట్ జమ్మూకశ్మీర్..
# బీజేపీ ఆరో జాబితా విడుదల



జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు జమ్మూకశ్మీర్‌లో గెలుపుపై ఫోకస్ పెట్టాయి. 370 ఆర్టికల్ రద్దు తర్వాత మొదటిసారి జరుగుతున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీతో పాటు పలుమ ప్రాంతీయ పార్టీలు జమ్మూకశ్మీర్‌లో గెలుపు కోసం శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకుంది. గెలుపుపై కాంగ్రెస్, ఎన్సీ కూటమి భారీ ఆశలు పెట్టుకుంది. తొలిసారి జమ్మూకశ్మీర్‌లో అన్ని రాజకీయ పార్టీలు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అన్ని పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. తాజాగా బీజేపీ 10 మంది అభ్యర్థులతో ఆరో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలోనూ జమ్మూకశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం కవీందర్ గుప్తాకు టికెట్ కేటాయించలేదు. 2014 ఎన్నికల్లో ఆయన గాంధీ నగర్ శాసనసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

**ఆరో జాబితా..**

బీజేపీ తన ఆరో జాబితాలో 10 మంది అభ్యర్థులను ప్రకటించింది. కర్నా నుంచి మహ్మద్ ఇద్రీస్ కర్నాహి, హంద్వారా నుంచి గులామ్ మహ్మద్ మీర్, సోనావారి నుంచి అబ్దుల్ రషీద్ ఖాన్, బందిపోరా నుంచి నసీర్ అహ్మద్ లోన్, గురేజ్ నుంచి ఫకీర్ మహ్మద్ ఖాన్, ఉదంపూర్ ఈస్ట్ నుంచి ఆర్ ఎస్ పఠానియా, కతువా నుంచి డాక్టర్ భరత్ భూషణ్, బిష్నా నుంచి రాజీవ్ భగత్, బహు నుంచి విక్రమ్ రంధావా, మార్ నుంచి సురీందర్ భగత్‌కు బీజేపీ టికెట్లు కేటాయించింది.


**అక్టోబర్8న ఫలితాలు**

జమ్మూ కాశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏడు నియోజకవర్గాలు ఎస్సీలకు, 9 నియోజకవర్గాలు ఎస్టీలకు రిజర్వు చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) 28 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 25, జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) 15, కాంగ్రెస్ 12 సీట్లు గెలుచుకున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలిదశ పోలింగ్ సెప్టెంబర్ 18న, రెండోదశ సెప్టెంబర్ 25, అక్టోబర్1న మూడో దశ పోలింగ్ జరుగుతుంది. అక్టోబర్8న ఓట్ల లెక్కింపు చేపడతారు.

**బీజేపీ హామీలు ఇవే..**

జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడమే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల వ్యూహాలను రూపొందిస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మెట్రో కనెక్టివిటీ, అమ్యూజ్‌మెంట్ పార్కులను ఏర్పాటు చేసి ప్రతి వృద్ధ మహిళకు ప్రతి సంవత్సరం రూ. 18వేలు ఇచ్చేలా 'మా సమ్మాన్ యోజన'ను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఉజ్వల పథకం కింద ప్రతి సంవత్సరం రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తామని, ప్రగతి శిక్షా యోజన కింద కళాశాల విద్యార్థులకు ప్రయాణ భత్యం కింద ఏడాదికి రూ. 3,000 ఇస్తామని బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది.

# ఎంపీ పదవికి రాజీనామా..
# సీఎం మమతకు ఘాటు లేఖ



**కోల్‌కతా :** ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ హత్యాచార ఘటనతోపాటు అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా ఆరోపణలు అయితే వెల్లువెత్తాయి. అలాంటి వేళ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత జవహర్ సిర్కార్.. తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో ఆందోళనలను అరికట్టడంలో పార్టీ ఘోర వైఫల్యం చెందిందన్నారు. పార్టీలో చోటు చేసుకున్న అవినీతిపై సీఎం మమతా బెనర్జీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. సీఎం మమతా బెనర్జీతో భేటీ అయి మాట్లాడేందుకు తనకు గత కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్నా.. అవకాశమే ఇవ్వడం లేదని జవహర్ సిర్కార్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడిన పలువురు ఉన్నతాధికారులు కీలక పదవుల్లో కొనసాగుతున్నారన్నారు. వైద్యురాలిపై హత్యాచారం అనంతరం రాష్ట్రంలో జరిగిన ఆందోళనలతో.. ఈ ప్రభుత్వ వెనుక ప్రజలు లేరనే విషయం స్పష్టమైందని చెప్పారు. ఈ హత్యాచార ఘటన కారణంగా జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారని.. ఈ నేపథ్యంలో గతంలో వలే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కఠిన చర్యలు తీసుకుంటారని తాను భావించానన్నారు. అందుకోసం ఈ ఘటన జరిగిన నాటి నుంచి తాను వేచి చూసినట్లు తెలిపారు. కానీ అలాంటి చర్యలు ఏమీ ఆమె తీసుకోలేదన్నారు. అంతేకాదు.. ఈ హత్యాచార ఘటన అనంతరం మమతా బెనర్జీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు తీవ్ర ఆక్షేపణీయంగా ఉన్నాయని విమర్శించారు. అలాగే పార్టీలో, ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను చక్కదిద్దాలని ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి ఆయన సూచించారు. అలా కాకుంటే.. రాష్ట్రం మతోన్మాద శక్తుల చేతుల్లోకి వెళ్లి పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ఉన్న ఈ మూడేళ్లలో... పెద్దల సభలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను లేవనెత్తిన విషయాన్ని ఈ సందర్భంగా జవహర్ సిర్కార్ గుర్తు చేశారు. తన పోరాటమంతా అవినీతితోపాటు మతతత్వంపైనేనని ఈ సందర్భంగా జవహర్ స్పష్టం చేశారు. మరోవైపు ఆర్ జీ కర్ కాలేజీ వైద్యురాలు హత్యాచారం ఘటన నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్పందించిన తీరుతో పాటు.. ఆ పార్టీ నేతలపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈ ఘటనపై స్పందించిన శంతన్ సేన్‌పై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే ఈ హత్యాచార ఘటనలో పార్టీ ప్రముఖ నేత సుఖేందు శేఖర్ రేను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### ఆధార్ కార్డు జారీ
### ఇక అంత ఈజీ కాదు



అసోం: ఆధార్ కార్డు జారీపై అసోం ప్రభుత్వం కొత్త రూల్ విధించింది. ఇక నుంచి రాష్ట్రంలో కొత్తగా ఆధార్ కార్డు కావాలనుకునే వారు తప్పనిసరిగా తమ జాతీయ పౌర నమోదు నంబర్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి రానున్నట్టు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ (%ఎఅమ్ఖత్ఝ దీఅంఝ ఝుతీమ్ఝ%) శనివారంనాడు ప్రకటించారు. జనాభా కంటే ఆధార్ కార్డు కోసం అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అనుమానిత వ్యక్తులు ఇందులో ఉన్నట్టు అర్థమవుతోం దని చెప్పారు. అక్రమ వలసలను అరికట్టడంలో భాగంగానే ఇక నుంచి ఆధార్ కార్డుల జారీ విషయంలో కఠినంగా వ్యవహరించాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఇక నుంచి అసోంలో ఆధార్ కార్డులు పొందడం అంత సులభం కాదన్నారు. ఎన్ఆర్‌సీ సమయంలో బయోమెట్రిక్ లాక్ అయిన 9.55 లక్షల మందికి ఎన్ఆర్‌సీ అప్లికేషన్ నెంబర్ జత చేయాల్సిన అవసరం లేదని, అక్రమంగా అసోంలోకి చొరబడే వారిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేశామని, గత రెండు నెలల్లో పలువురు బంగ్లాదేశీయ ఎలను పట్టుకుని ఆ దేశ అధికారులకు అప్పగించామని తెలిపారు.

## బలవంతపు వసూళ్ల కోసం దుండగులు యత్నం



**న్యూఢిల్లీ:** క్లబ్ యజమాని నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసేందుకు కొందరు దుండగులు ప్రయత్నించారు. క్లబ్ వద్దకు వచ్చిన సాయుధులు అక్కడున్న బౌన్సర్లను మోకాలుపై కూర్చోవాలని బెదిరించారు. ఆ తర్వాత క్లబ్‌లోకి వెళ్లారు. ఎవరూ లేకపోవడంతో ఆగ్రహంతో ఓనర్‌ను తిట్లారు. ఆ క్లబ్ బయట గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. గురువారం అర్ధరాత్రి వేళ ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో ఉన్న కాంచ్ క్లబ్ వద్దకు ముగ్గురు సాయుధులు వచ్చారు. గన్ తీసిన ఒక వ్యక్తి మహిళతో సహా ఇద్దరు బౌన్సర్లను మోకాలుపై కూర్చోవాలని బెదిరించాడు. పైకి లేస్తే వారి తలపై కాల్చివేస్తానని హెచ్చరించారు. కాగా, మరో ఇద్దరు వ్యక్తులు ఆ క్లబ్‌లోకి వెళ్లారు. యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని భావించారు. అయితే క్లబ్ లోపల ఎవరూ లేకపోవడంతో బయటకు వచ్చారు. ఓనర్‌ను తిడుతూ క్లబ్ వద్ద గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ క్లబ్ వద్దకు చేరుకున్నారు. అక్కడున్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. నిందితుల్లో ఒకరిని ఘజియాబాద్‌కు చెందిన షారుక్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. మిగతా నిందితుల కోసం వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస.. ఆరుగురు మృతి



ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. జిరిబామ్ జిల్లాలో ఆరుగురు మృతి చెందారు. శనివారం ఉదయం ఓ వ్యక్తిని నిద్రలోనే కాల్చి చంపారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. కాల్పులు కూడా చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మరో ఐదుగురు సాయుధులు ప్రాణాలు కోల్పోయినట్లు మణిపూర్ పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు చూరాచాంద్‌పుర్‌లో మిలిటెంట్లకు చెందిన మూడు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను ఇక్కడ్నుంచే చేపట్టినట్లు తెలుస్తోంది. రాకెట్ దాడుల్లో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. తొలి రాకెట్ దాడి తెల్లవారుజామున 4.30 గంటలకు ట్రోంగ్లావ్‌బిలో చోటు చేసుకుంది. ఈ దాడిలో రెండు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. రెండో దాడి మ. 3 గంటలకు మొయిరంగ్‌లోని మాజీ సీఎం మైరెంబమ్ కొయిరెంగ్ నివాస ఆవరణలో జరిగింది. రాకెట్‌కు అమర్చిన బాంబులు పేలడంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ పరిణామాల నేపథ్యంలో చూరాచాంద్‌పుర్‌లోని మువాల్‌సంగ్, లైకా మువాల్సు గ్రామాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి మూడు బంకర్లను కూల్చేశారు పోలీసులు.

### ఈడీ తనిఖీలు..
### రూ. 6.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత



కోల్‌కతా, సెప్టెంబర్ 08: కోల్‌కతాలో వ్యాపారవేత్త స్వపన్ సాహా నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 9 కేజీల బంగారాన్ని ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనితోపాటు భారీ నగదు, పలు డాక్యుమెంట్లను సైతం ఈడీ అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ రూ. 6.5 కోట్లు ఉంటుందని వారు వివరించారు. పట్టుబడిన బంగారంపై పలు ప్రశ్నలు సంధించగా.. వాటిని సరైన సమాధానాలు స్వపన్ సాహా ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ఢిల్లీ వేదికగా జరిగే తమ విచారణకు హాజరు కావాలని స్వపన్‌కు సమన్లు జారీ చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున బంగారం లభించడంతో.. అందుకు సంబంధించిన పత్రాలను సైతం ఢిల్లీకి తీసుకు రావాలని ఆ సమన్లలో ఈడీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కోట్లాది రూపాయల బ్యాంకు మోసం కేసులో స్వపన్ సాహాపై భారీగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోల్‌కతా మహానగరంలో సాల్ట్ లేక్‌లోని స్వపన్ సాహా నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

### గుజరాత్ గ్రామాల్లో కలకలం




**అహ్మదాబాద్:** నలుగురు పిల్లలతో సహా 12 మంది తీవ్ర జ్వరం వల్ల మరణించారు. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బంది కలుగుతున్నదని రోగులు వాపోయారు. అయితే రోగం ఏమిటన్నది డాక్టర్లు సైతం గుర్తించలేకపోతున్నట్లు ఆ గ్రామస్తులు ఆరోపించారు. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఈ పరిస్థితి నెలకొన్నది. లఖ్‌పత్ తాలూకాలోని బెఖాడా, సనాంద్రో, మోర్గార్, భరవంద్ గ్రామాల్లో జనం వింత రోగాల బారిన పడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, న్యుమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో రోగులు బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి ఇప్పటి వరకు నలుగురు పిల్లలతో సహా 12 మంది తీవ్ర జ్వరంతో మరణించినట్లు చెప్పారు. భారీ వర్షాలకు ప్రభావితమైన ఈ ప్రాంతంలో రోగులకు వ్యాపిస్తున్న వ్యాధి ఏమిటన్నది డాక్టర్లు కూడా కచ్చితంగా నిర్ధారించలేకపోయినట్లు గ్రామస్తులు ఆరోపించారు. కాగా, ఈ మరణాలకు ప్రధాన కారణం న్యుమోనైటిస్ అని అధికారులు ఆదివారం తెలిపారు. హెచ్1ఎన్1, స్వైన్ ఫ్లూ, క్రిమియన్-కాంగో ఫీవర్, మలేరియా, డెంగ్యూ అవకాశాలను తోసిపుచ్చలేమని చెప్పారు. పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో ఉన్న ఈ తాలూకాలో వైద్య సేవలను ముమ్మరం చేసినట్లు కచ్ కలెక్టర్ అమిత్ అరోరా తెలిపారు. వైద్య బృందాలను అక్కడకు పంపడంతోపాటు రోగుల నుంచి నమూనాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

### దేశంలో మంకీపాక్స్ తొలి కేసు?..
### భయాందోళన వద్దన్న కేంద్రం




**న్యూఢిల్లీ:** ప్రపంచాన్ని భయపెడుతున్న మంకీపాక్స్ తొలి కేసు దేశంలో నమోదైనట్లు తెలుస్తున్నది. ఈ వైరస్ లక్షణాలున్న వ్యక్తికి ఎంపాక్స్ సోకినట్లు అనుమానిస్తున్నారు. ప్రత్యేక ఆసుపత్రిలోని ఐసొలేషన్‌లో అతడ్ని ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పరీక్షకు పంపినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవద్దని పేర్కొంది. ఎంపాక్స్ వైరస్‌తో పోరాడుతున్న దేశం నుంచి ఇటీవల భారత్‌కు తిరిగి వచ్చిన యువకుడ్ని అనుమానిత కేసుగా గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. ఆ రోగిని ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు చెప్పింది. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పేర్కొంది. ఆ వ్యక్తికి ఎంపాక్స్ సోకిందా లేదా అన్నది నిర్ధారించేందుకు అతడి నమూనాలను పరీక్ష కోసం పంపినట్లు వెల్లడించింది. కాగా, ఎంపాక్స్‌కు సంబంధించిన ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఈ కేసును డీల్ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆ వ్యక్తిని కలిసిన వారిని గుర్తించేందుకు, అతడి నుంచి వైరస్ వ్యాప్తిని నిర్ధారించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ) జారీ చేసిన ప్రమాద అంచనాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మంకీపాక్స్‌ను ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉన్నట్లు వివరించింది. మరోవైపు తాజాగా ప్రపంచాన్ని వణికిస్తున్న ఎంపాక్స్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా గత నెలలో ప్రకటించింది. 2022 జనవరి నుంచి 2024 ఆగస్ట్ వరకు 120కుపైగా దేశాల్లో ఎంపాక్స్ వ్యాప్తి చెందినట్లు తెలిపింది. లక్షకుపైగా కేసులు నిర్ధారణ కాగా, 220కుపైగా మరణాలు నమోదైనట్లు పేర్కొంది.

# కూల్చివేత.. గుండెకోత

-మొదటిపేజీ తరువాయి

ఓ వైపు వర్షం, మరో వైపు ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే హైడ్రా అధికారులు కూల్చివేతలు చేశారు. పండగ పూట వర్షంలో పిల్లలను తీసుకొని ఎటుపోవాలో దిక్కుతోచక బాధితులు బిక్కు బిక్కుమంటూ కన్నీరుమున్నీరయ్యారు. 'కేసీఆర్ నిరాహార దీక్ష చేసి తెలంగాణ తెచ్చారు.. నువ్వేం చేశావు.. మా బతుకులు కొట్టడానికే నువ్వొచ్చావా బాబు..' అంటూ ఓ మహిళ సీఎం రేవంత్‌ను ఉద్దేశిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. మరో మహిళ కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేస్తూ రేవంత్‌సర్కార్‌పై దుమ్మెత్తిపోశారు. రూపాయి రూపాయి కూడబెట్టి స్థలం కొనుగోలు చేసి నిర్మాణాలు చేశామని, తమను ఆకస్మాత్తుగా రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'మాకు చావే శరణ్యం'అని ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. మా పేదల ఇండ్లు కూలగొడితే రేవంత్ నాశనాన్ని కోరుకున్నట్టేనని బాధితులు శాపనార్థాలు పెట్టారు.

మరికొంతమంది మా త్రం ప్రభుత్వ నిబంధనలు పేదలకేనా ? సంపన్నులకు వర్తించవా? అని అధికారులను ప్ర శ్నించారు. హైడ్రా ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక ప్రజలు ఆందోళనకు చేస్తుండడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. దుండిగల్‌లో ఇండ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి కూల్చేసేందుకు హైడ్రా ప్రయత్నించగా బాధితులు తిరగబడ్డారు. దీంతో మరో 14 మంది కి వారం రోజులు గడువు ఇచ్చారు. అలాగే సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలో ఆదివారం హైడ్రా ఆధ్వర్యంలో అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ఆదివారం హైడ్రా నేతృత్వంలో తహసీల్దార్ రాధా, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో కూల్చివేతలు చేశారు. పెద్ద చెరువు ప్రాంతంలో సర్వేనెంబర్ 323, 324, 329 గల స్థలంలో ఆంధ్రప్రదేశ్ వైసీపీకి చెందిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి చెందిన స్థలాలలో నిర్మించిన ప్రహరీ, షెడ్లు, రూములను నేలమట్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఇరిగేషన్ డీఈ రామస్వామి సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



**సంపన్నులకు వర్తించని నిబంధనలు**

మాదాపూర్ సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలున్నాయని గుర్తించిన హైడ్రా ఆదివారం భారీ యంత్ర పరికరాలతో సున్నం చెరువు వద్దకు చేరుకొని కూల్చేవేతచేపట్టారు. పొట్టకూటి కొరకు ఒడిశా నుంచి వచ్చిన కూలీలు సున్నం చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో రేకుల షెడ్‌లను నిర్మించుకున్నారు. ఉదయం 5 గంటలకు వచ్చిన హైడ్రా అధికారులు షెడ్లను ఖాళీ చేయమని చెప్పి గంట వ్యవధిలోనే ఆయా షెడ్లను కూల్చివేయడం ప్రారంభించారు. దీనిపై అక్కడున్న పేదలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ రేవంత్ సర్కారుకు పక్కనున్న ఎఫ్‌టీఎల్ పరిధిలోని సంపన్నుల భవనాలు, విల్లాలు కనిపించడం లేదా? పేదలపై మీ ప్రతాపమా? అంటూ మండిపడ్డారు. భారీ భవనాల్లో, విల్లాల్లో ఉంటున్న వారికి హైడ్రా ముందస్తు నోటీసులిస్తుందని, గుడిసెల్లో ఉంటున్న వారికి గంట సమయం ఇవ్వకుండా కూల్చేస్తున్నారని పేద ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెరువు ఎఫ్‌టీఎల్ నిర్మిస్తున్న రెండు భవనాలు, అక్కడ కొనసాగతున్న ఒక డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, పేదలు ఉంటున్న 30కి పైగా షెడ్లను హైడ్రా కూల్చేసింది. షెడ్లను కూల్చేస్తుండటంతో బాధితులు హైడ్రా అధికారులపై తిరగబడ్డారు. తమకు హైడ్రా తీవ్రంగా అన్యాయం చేస్తుందని నిరసిస్తూ ఒక మహిళ, మరో పురుషుడు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యయతానికి పాల్పడ్డారు. వారిని పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. దీంతో స్థానికులు ఆందోళనకు సిద్ధం కాగా, భారీఎత్తున అదనపు పోలీసు బలగాలను రప్పించి చెదరాగొట్టారు. దీంతో ఉద్రిక్తతం నెలకొన్నది. మాదాపూర్ సున్నం చెరువు విస్తీర్ణం ఎఫ్‌టీఎల్‌తో కలిసి 29.75 ఎకరాలు, నీటిని విస్తరించి ఉన్న ప్రాంతం 15.20 ఎకరాల విస్తీరణంలో ఉంది. మిగతాది ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుంది.

# ఫోర్త్‌సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

-మొదటిపేజీ తరువాయి

జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేహెచ్‌ఎస్)కు భూమి స్వాధీన పత్రాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొ న్నం ప్రభాకర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భం గా సీఎం మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజానికి చికిత్స చేసే డాక్టర్లు అనే భావనతో వారి సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇండ్ల స్థలాలు కేటాయించారని గుర్తుచేస్తూ.. ఇప్పుడు ఆ స్థలాలను తమ చేతుల మీదుగా అందజేయడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. అర్హులైన మిగిలిన జ ర్నలిస్టులకు కూడా ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు తగిన నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి ఎలాంటి శశభిషలూ లేవని తెలిపారు.



**వృత్తిపరమైన గౌరవాన్ని మనమే పెంచుకోవాలి**

వృత్తిపరమైన గౌరవాన్ని ఎవరూ పెంచరని, తమ కు తామే పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్బోధించారు. కొందరు చేసే పనులతో జర్నలిస్టులందరికీ చెడ్డపేరు వస్తున్నదని, అలాంటి వారిని నియంత్రించే బాధ్యత జర్నలిస్టులపైనే ఉన్నదని వ్యాఖ్యానించారు.

**మీడియా అకాడమీకి 10 కోట్లు**

ఆరోగ్య భద్రత కార్డులు, అక్రిడిటేషన్, ఇతర సమస్యలకు శాశ్వత పరిషారం చూపేందుకు మీడియా అకాడమీ కొత్త విధివిధానాలను రూపొందించాలని సీఎం సూచించారు. మీడియా అకాడమీకి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.10 కోట్లు ఇస్తున్న ట్టు సీఎం ప్రకటించారు. ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో భాగస్వాములమవుదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చనిపోయి న 41 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెకును సీఎం అం దజేశారు. అనంతరం జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు పేట్‌బషీర్‌బాగ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కేటాయించిన 38 ఎకరాల భూమి స్వాధీనపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ పాల్గొన్నారు.

# కొండంత సాయం..

-మొదటిపేజీ తరువాయి

కాస్త ఊపిరిపీల్చుకుంటున్నారు. అయితే.. వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకొచ్చారు. సామాన్య ప్రజలు మొదలుకుని సెలబ్రిటీలు, పలు రంగాల పెద్దలు ముందుకొచ్చి తమకు తోచినంత విరాళంగా ప్రకటించారు. వారు ప్రకటించిన సొమ్ము అంతా చెక్కులు, నేరుగా నగదు, ఆన్‌లైన్ రూపంలో ఇప్పటికే సీఎం సీఎం సహాయ నిధికి అందజేశారు. ఇక 'మేము సైతం' అంటూ తెలంగాణాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చి కొండంత సాయం చేసింది.

కొండంత సాయం..

భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మంను ఆదుకోవడానికి కాంగ్రెస్ కొండంత సాయం చేసింది. వరద బాధితుల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలు కార్పోరేషన్ల చైర్మన్లు కూడా ఉన్నారు. వీరంతా తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులు సైతం తమ రెండు నెలలు జీతం ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించారు. కాంగ్రెస్ నేతలంతా.. సీఎం రేవంత్ రెడ్డి, కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర, కేంద్ర మంత్రులు ఇలా..!



కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నిర్ణయం పట్ల సామాన్య ప్రజలు, వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక వరద బాధిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. మరోవైపు.. సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక సమీక్షలు, సమావేశాలు రద్దు చేసుకుని మరీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు వరద ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటున్నారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఖమ్మంలో పర్యటించగా.. ఆదివారం నాడు మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పర్యటించారు. వరద బాధితులను కేంద్రం తప్పకుండా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక వచ్చిన వెంటనే పూర్తి నిధులు వస్తాయన్నారు. వరద సాయం విషయంలో కేంద్రానికి వివక్ష లేదని.. స్టేట్ డిజాస్టర్ నిధులతో వరద బాధితులను ఆదుకోవాలన్నారు. మరోసారి తుఫాన్ ముప్పు పొంచి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని కిషన్ రెడ్డి సూచించారు.

## కూల్చి వేతలకు చెక్ పెట్టనుందా?



**హైదరాబాద్ :** హైడ్రాపై మధ్య తరగతి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పెద్దలను వదిలి పేదలపై ఉక్కపాదం మోపుతుండటం ప్రజలు తీవ్ర ఆగ్రం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం ఇంట్లోని సమాను తీసుకునే సమయం ఇవ్వకుండా ఇండ్లు కూల్చివేస్తుండటంతో పేదలు, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత వస్తున్నది. కూల్చివేతలను నిరిసిస్తూ పలుచోట్ల పేదలు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయాన్నికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. ఆల్రెడీ నివాసం ఉంటున్న గృహాలను కూల్చం. కొత్త నిర్మాణాలు మాత్రమే కూలుస్తున్నామని వివరణ ఇచ్చారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు స్థలాలు ఇకపై కొనవద్దని హైడ్రా సూచింది. దీంతో ఇక హైడ్రామాకు హైడ్రా చెక్ పెట్టనుందా? అనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. కాగా, నగరంలో మరోసారి హైడ్రా కూల్చి వేతలు మొదలయ్యాయి. మాదాపూర్ సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇండ్లను హైడ్రా అధికారులు కూల్చేశారు. హైడ్రా కూల్చివేతలపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించారు. గమనించిన పోలీసులు వారిని అక్కడ నుంచి తరలించే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

## కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు

-మొదటిపేజీ తరువాయి

పెట్టావ్.. చేసిందేమో కేవలం రూ. 17 వేల కోట్లు మాత్రమే. పార్లమెంట్ ఎన్నికల ముందు దేవుడి మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు లోగా రుణమాఫీ పూర్తి చేస్తా అంటివి. ఇవాళ రేషన్ కార్డు నిబంధన పెట్టి.. తల్లికి, పిల్లల మధ్య గొడవ పెడితివి. కుటుంబ బందాల మధ్య చిచ్చు పెట్టినవ్. నీ దరిద్రపు గొట్టు రాజకీయం వల్ల మీ పాలనలో కుటుంబ బంధాలన్నీ కూడా చెడిపోతున్నాయి. కేసీఆర్ పాలనలో తల్లులను పిల్లలు సరిగా చూడడం లేదని 200 ఉన్న పెన్షన్‌ను రూ. 2 వేలు చేసి కుటుంబ బంధాలను బలోపేతం చేశారు. కానీ నీవు కోతలు పెట్టడానికి రుణమాఫీ డబ్బు తగ్గించడానికి కుటుంబాల మధ్య చిచ్చు పెట్టన చరిత్ర రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ పార్టీది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## వరదలపై రాజకీయం సరికాదు

**ఖమ్మం:** మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ దంసాలపురం, తిరుమలాయపాలెం, రాకాసి తండాలో వరదముంపు బాధితులతో కేంద్ర మంత్రి మాట్లాడారు. వీధుల్లో తిరుగుతూ అక్కడి పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. నిత్యావసరాల పంపిణీ, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. కిషన్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రకృతి వైపరీత్యాలు వంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1,300 కోట్లు పంపింది. వరదపై రాజకీయం చేయడం సరికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్నేరు వరద బాధితులకు అండగా ఉంటాయి. వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తాం. వర్షాలకు సర్వం కోల్పోయిన వారిని చూస్తుంటే బాధేస్తోంది. రాజకీయాలకు అతీతంగా బాధితులను ఆదుకుందాం. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితుల కోసం సహాయక కార్యక్రమాలు వేగవంతం చేయాలి. తెలంగాణ ప్రభుత్వం నుంచి నివేదిక వచ్చిన తర్వాత కేంద్ర బృందాలు పర్యటించి పంట, పశుసంపద నష్టంపై అంచనాలు తయారు చేస్తారు. అనంతరం బాధితులకు వికాస్ మేనేజ్మెంట్ కింద సహాయం చేస్తాం" అని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఇలాంటి సమయాల్లో పార్టీలన్నీ ప్రజలకు సేవ చేసేందుకు కలిసి ముందుకు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజలకు సేవ చేయడం పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాయని మంత్రి హామీ ఇచ్చారు. బ్యాంకులు తెరిచిన వెంటనే తక్షణ సాయం కింద మున్నేరు వరద బాధితుల అకౌంట్లో నగదు వేస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి చెప్పారు.

## హైడ్రా నోటీసులపై మురళీమోహన్ ఫస్ట్ రియాక్షన్..




హైదరాబాద్: జయభేరీ కన్‌స్ట్రక్షన్స్‌కు హైడ్రా నోటీసులు.. గత 24 గంటలుగా ఎటు చూసినా ఇదే చర్చ.. అంతకుమించి రచ్చ!. ఎన్ కన్వెన్షన్ తర్వాత జే కన్‌స్ట్రక్షన్ వంతు వచ్చేసింది..! ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యింది.. 15 రోజుల్లో నేల మట్టం అంటూ మీడియాలో, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్ర విచిత్రాలుగా కథనాలు వచ్చాయి కానీ.. 'వాళ్లకు వాళ్లుగా కూల్చితే సరే లేకుంటే మేమే కూల్చేస్తాం' అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఎట్టకేలకు హైడ్రా ఇచ్చిన నోటీసులపై టాలీవుడ్ సీనియర్ నటుడు మురళీమోహన్ స్పందించారు.


**మూడు అడుగులే..**

మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించిన మురళీమోహన్ తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని క్లారిటీ ఇచ్చుకున్నారు. ' నేను ఆక్రమణలకు పాల్పడలేదు. 33 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. ఏనాడూ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తాను. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు వచ్చారు. బఫర్ జోన్‌లో మూడు అడుగుల మేరకు.. రేకుల షెడ్డు ఉన్నట్టు అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఆ రేకుల షెడ్డును మేమే తొలగించేస్తాం.. హైడ్రా రానక్కర్లేదు. రెండ్రోజుల్లో (మంగళవారం లోపు) తాత్కాలిక షెడ్డును తొలగిస్తాం ' అని మురళీ మోహన్ స్పష్టం చేశారు. దీంతో కొన్ని గంటలుగా మురళీ మోహన్‌పై వచ్చిన చిత్ర విచిత్రాలుగా వచ్చిన కథనాలు, విమర్శకులకు చెక్ పెట్టినట్లు అయ్యింది.

**తొలగిస్తే సరే..**

హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాత ఆ సంస్థ చీఫ్ ఏవీ రంగనాథ్ కూడా స్పందించారు. ' హైదరాబాద్‌లోని నానక్ రామ్‌గూడ రంగలాల్ చెరువులో నటుడు మురళీ మోహన్ జయభేరి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాం. ఫిర్యాదులు రావడంతో చెరువును పరిశీలించాం. ఆక్రమణ జరిగినట్లుగానే మా పరిశీలనలో తేలింది. వారంలో రోజుల్లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను తొలిగించేందుకు జయభేరి సంస్థ గడువు కోరారు. ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా కూల్చివేస్తుంది' అని రంగనాథ్ హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. సండే అయినా సరే కూల్చుడే అంటూ హైడ్రా నాన్ స్టాప్‌గా, దూకుడు మీద కూల్చివేతులు షురూ చేసింది. ఇవాళ ఒక్కరోజే భారీగా కూల్చివేతలు జరిగాయి. మాదాపూర్, మేడ్చల్ జిల్లా మల్లంపేట్, సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు వద్ద.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తోంది. ఇక మాదాపూర్ సున్నం చెరువులో కూడా హైడ్రా కొరడా ఝులిపించింది. సున్నం చెరువు మొత్తం విస్తీర్ణం 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న షెడ్డులను భారీ బందోబస్తు మధ్య హైడ్రా కూల్చేసింది.

# మొబైల్‌కు అడిక్ట్ అయ్యారా?



చాలా మంది మద్యం, గంజాయి, పొగాకు వంటి చెడు వ్యవసనాలకు బానిసగా మారి జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటూ ఉంటారు. ఇలాంటి మరో వ్యసనం కూడా ఉంది. అదే ఇంటర్నెట్ అడిక్షన్.ప్రత్యక్షంగా ఎటువంటి హాని కలగజేయనప్పటికీ మద్యపానం, సిగరెట్ వ్యసనం కంటే ఇది మరింత హానికరం. 8 నుంచి 80 ఏళ్ల వరకు అందరూ నేటి కాలంలో స్మార్ట్ ఫోన్ల ప్రపంచంలోనే మునిగిపోతున్నారు. ప్రస్తుతం కాలంలో మొబైల్ సహాయంతో చేయలేని పనిలేదు. చెప్పలంటే అరచేతిలోకి ప్రపంచమే వచ్చి నట్టైంది. వ్యసనాలకు అడిక్ట్ అయిన తర్వాత బయట పడటం చాలా కష్టం. ఇంటర్‌నెట్ కూడా అలాంటిదే. దీని మాయలోపడితే రోజు గంటలు గడిచిపోతూనే ఉంటాయి. కాబట్టి ప్రమాదం ముంచుకు రాకముందే జాగ్రత్తపడాలంటున్నారు ఆరోగ్య నిపుణులు.రోజంతా ఏం చేసినా.. మనసు మొబైల్ పైనే ఉంటుంది. పని చేసే సమయంలో మొబైల్‌లో ఏదో ఒకటి చూసుకోవడం అలవాటై పోయింది. అయితే రోజంతా మొబైల్ చూడకుండా.. పని వేగంగా చేయడంతోపాటు, సమయం కూడా ఆదా అవుతుంది. అలాగే మీరు సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు ఎంతమంది లైక్‌లు ఇచ్చారు, ఎంతమంది చూశారు.. వంటి సిల్లీ విషయాల కోసం అతిగా ఆలోచించకండి. మనసు వేరే పని మీద మళ్లకుండా కేవలం మొబైల్ ఫోన్ తోనే గడిసేస్తుంటే మెల్లమెల్లగా వ్యసనం వైపు పయనిస్తున్నట్లు అర్థం చేసుకోవాలి. ఫ్రెండ్స్ తో టైమ్ స్పెండ్ చేయడం కంటే నెట్ వరల్డ్ అట్రాక్షన్ ఎక్కువైతే ఆ టెన్షన్ మానుకోవడం మంచిది. లేదంటే మీ నెట్ అడిక్షన్ పెరిగిపోతుంది. అలాగే సమయం ఉన్నప్పుడు ఈ వ్యసనాన్ని వదిలించుకోవడం గురించి ఆలోచించాలి. మొబైల్ కాకుండా ఇతర విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. స్నేహితులతో బయటకు వెళ్లడం, కుటుంబంలోని ఇతర వ్యక్తులకు సమయం ఇవ్వడానికి ప్రయత్నించండి. రోజులో కొంత సమయం వ్యాయామం చేయాలి. మొబైల్ ఏయే విషయాలకు చూడాలో ఖచ్చితంగా నిబంధన పెట్టుకోండి.

## టైల్స్‌పడ్డ నూనె మరకలను ఎలా పోగొట్టాలంటే..



సాధారణంగా వంటింట్లో వంట చేసేటప్పుడు మరకలు అవుతూ ఉండటం కామన్. టైల్స్, గోడలపై మరకలు పడి మురికిగా ఉంటాయి. అయితే వీటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేయడానికి కుదరదు. అప్పుడప్పుడూ క్లీన్ చేసినా జిడ్డుగా మారి.. మురికి అస్సలు పోదు. దీని వల్ల గోడలు, టైల్స్ చాలా మురికిగా పాత వాటిలా ఉంటాయి. అయితే ఇప్పుడు చెప్పే చిట్కాలు పాటిస్తే.. మురికి పోయి కొత్త వాటిలా మెరుస్తాయి. మొండి మరకలను వదిలించడంలో లిక్విడ్ డిష్ వాష్ ఎంతో ఎఫెక్టీవ్‌గా పని చేస్తుంది. గోరువెచ్చటి నీటిలో కొద్దిగా లిక్విడ్ డిష్ వాష్ వేసి బాగా మిక్స్ చేయాలి. దీన్ని కిచెన్ టైల్స్, గోడలపై అప్లై చేసి ఓ ఐదు నిమిషాలు వదిలేయండి. ఆ తర్వాత స్క్రబ్ చేస్తే జిడ్డు పోతుంది. మొండి మరకలను తొలగించడంలో నిమ్మరసం ఎంతో చక్కగా పని చేస్తుంది. కొద్దిగా నీటిలో నిమ్మరసం, కొద్దిగా సర్ఫ్ కలిపి టైల్స్, గోడలపై చల్లి స్క్రబ్ చేయండి. ఇలా చేయడం వల్ల మురికి వదిలి కొత్తవాటిలా మెరుస్తాయి.వెనిగర్ కూడా జిడ్డు మరకలను వదిలించడంలో హెల్ప్ చేస్తుంది. కిచెన్ టైల్స్ పై పడ్డ మరకలను పోగొట్టడం వెనిగర్ బాగా పని చేస్తుంది. కొద్దిగా గోరు వెచ్చని నీటిలో వెనిగర్ మిక్స్ చేసి.. మరకలపై చల్లాలి. ఓ రెండు నిమిషాల తర్వాత స్క్రబ్ చేస్తే సరిపోతుంది. బేకింగ్ సోడాతో కూడా టైల్స్‌పై పడ్డ మరకలను ఈజీగా వదిలించుకోవచ్చు. చిన్న పాత్రలో వేడి నీళ్లు తీసుకోండి. అందులో బేకింగ్ సోడా మిక్స్ చేసి.. మొండి మరకలు ఉన్న చోట నీళ్లు వేస్తూ స్క్రైబ్ చేయాలి. ఇలా చేయడం వల్ల మరకలు పోయి.. కొత్త వాటిలా ఉంటాయి.

# ఫ్రిడ్జ్‌లో ఈ వస్తువులు పెట్టొద్దు

ప్రస్తుతం బిజీ బిజీ లైఫ్.. దీంతో రోజూ మార్కెట్‌కి వెళ్లడం కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయడం సాధ్యం కాదు. కనుక చాలా మంది అవసరమైన దానికంటే ఎక్కువ వస్తువులను కొనుగోలు చేస్తారు. దీంతో ఇప్పుడు ఫ్రిజ్ లేకుండా ఒక్క క్షణం కూడా రోజు జరుగుతుందా అనే పరిస్థితి నెలకొంది. ఫ్రిడ్జ్ రోజు వారీ జీవితంలో ఒక ముఖ్యమైన వస్తువుగా మారిపోయింది. దీనిలో కూరగాయలు, పండ్లు, పువ్వులు, కోడి గుడ్లు, పాలు, పెరుగు ఇలా రకరకాల వస్తువులను నిల్వ చేసుకుంటున్నారు. అయితే ఇలా కొన్ని రకాల వస్తువులను కొనుగోలు చేసి ఫ్రిజ్‌లో ఉంచడం వలన ఆరోగ్యానికి హానికరం. అన్ని రకాల వస్తువులను ఫ్రిజ్‌లో ఎక్కువసేపు ఉంచడం మంచిది. ఇలా రిఫ్రిజిరేటర్‌లో ఉంచినప్పుడు వాటి నాణ్యతను కోల్పోయే అనేక ఆహారాలు ఉన్నాయి. వీటిని పొరపాటున కూడా ఫ్రిజ్‌లో ఉంచవద్దు. అవి ఏమిటో ఈ రోజు తెలుసుకుందాం..బ్రెడ్: చాలా మంది బ్రెడ్‌ని ప్యాకెట్లలో ఫ్రిజ్‌లో ఉంచుతారు. రిఫ్రిజిరేటర్ ఆహారం నుండి ఈ బ్రెడ్ అదనపు నీటిని గ్రహిస్తుంది. కనుక బ్రెడ్‌ని ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల అది పొడిగా మారుతుంది. కేకుల విషయంలో కూడా అదే జరుగుతుంది. బంగాళదుంపలు: పచ్చి బంగాళదుంపలను ఫ్రిజ్‌లో ఉంచవద్దు. బంగాళదుంపలను ఎప్పుడూ వంటగది బుట్టలో ఉంచండి. బంగాళదుంపల్లో కార్బోహైడ్రేట్లు, స్టార్చ్ వంటిది అధికంగా ఉన్నాయి. కనుక వీటిని ఫ్రిజ్‌లో ఉంచితే చక్కెర శాతం పెరుగుతుంది. అంటే బంగాళాదుంప రుచి తియ్యగా మారవచ్చు. మసాలా దినుసులు: చాలా మంది దాల్చిన చెక్క, లవంగాలు, మిరియాలు వంటి మసాలా దినుసులను ఫ్రిజ్‌లో ఉంచుతారు. అదే విధంగా తులసి దళాలు, రోజ్మేరీ, పుదీనా ఆకులను ప్యాకెట్లలో చుట్టి ఫ్రిజ్ లో పెడతారు. అయితే ఇలా చేయడం వలన త్వరగా కుళ్ళిపోతాయి. అయితే వీటిని గాజు సీసాల్లో పెట్టుకుని నిల్వ చేసుకోవచ్చు. అయితే, సూర్య రశ్మికి దూరంగా ఉంచండి. తేనె: స్వచ్ఛమైన తేనె ఏళ్ల తరబడి నిల్వ ఉంటుంది. తేనెను ఫ్రిజ్‌లో ఉంచాల్సిన అవసరం లేదు. వంటగదిలో తేనె పెట్టవద్దు. చాలా వేడి వాతావరణంలో తేనెను నిల్వ చేసుకోవాలంటే నీటితో నిండిన గిన్నెలో తేనె బాటిల్ ని ఉంచవచ్చు.వెల్లుల్లి: బంగాళదుంపల మాదిరిగా, వంటగది బుట్టలో వెల్లుల్లి ఉంచండి. వెల్లుల్లిని ఫ్రిజ్‌లో ఉంచితే దాని రుచి, వాసన రెండూ పోతాయి. చాలా మంది ఒలిచిన వెల్లుల్లిని రిఫ్రిజిరేటర్‌లో కూడా నిల్వ చేస్తారు. అలాంటప్పుడు మీరు ఎయిర్ టైట్ కంటైనర్ ను ఉపయోగించాల్సి ఉంటుంది. అయినప్పటికీ అసలు వెల్లుల్లిని ఫ్రిజ్‌లో ఉంచకపోవడమే మంచిది.




# చెడు అలవాట్ల వల్ల బరువు పెరుగుతారా?



చాలామంది చెడు అలవాట్లు వల్ల బరువు ఎక్కువగా పెరిగిపోతూ ఉంటారు. బయట ఫుడ్ తినటం వల్ల కూడా బరువు పెరుగుతారు. ఎక్ససైజ్ లేకపోవటం ఎక్కువగా కూర్చోవటం వల్ల కూడా బరువు ఎక్కువగా పెరుగుతారు.ఈ ఉదయపు చెడు అలవాట్లు వల్ల బరువు పెరుగుతారట..!ఉదయం ఎక్కువసేపు నిద్రపోవడం వల్ల సిర్కాడియన్ రీథమ్ కు అంతరాయం కలుగుతుంది. ఇది జీర్ణ క్రియను దెబ్బ తీసి బరువు పెరగటానికి కారణం అవుతుంది. ఉదయం ఆలస్యంగా నిద్రలేవటం వల్ల నేరుగా అల్పాహారం, టి, కాఫీ వంటివి తాగుతారు. ఇది శరీరాన్ని డిహైడ్రేట్ చేస్తుంది. అతిగా తినేలా ప్రేరేపిస్తుంది. ఉదయమనే నిద్ర లేవకపోతే చాలామందిలో నిద్రలేమి, బద్ధకం, ఏ పని చేయాలని అనిపించకపోవడం వంటివి జరుగుతాయి. ఉదయం లేటుగా నిద్ర లేస్తే వ్యాయామం చేసే సమయం ఉండదు. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. ఉదయమునే టీ లేదా సోడా వంటి తీపి పానీయాలు తాగేవారు తొందరగా బరువు పెరుగుతారు. తీపి వల్ల బరువు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉదయం ఆలస్యంగా నిద్ర లేచే చాలామంది అల్పాహారాన్ని స్కిప్ చేస్తుంటారు. ఇది ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఉదయాన్నే అల్పాహారంలో ప్రోటీన్ తీసుకోని వారు బరువు పెరిగే అవకాశాలు ఎక్కువ. ఉదయాన్నే అధిక కార్బోహైడ్రేట్స్ కలిగిన ఆహారం తీసుకున్న బరువు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి దారితీస్తుంది. ఫోన్ లేదా టీవీ వంటివి చూస్తూ తినే అలవాటు ఉన్నవారు బరువు పెరిగే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఇలాంటివి చెయ్యకుండా ఉంటే బరువు అనేది పెరగకుండా ఉంటారు. ఉదయం లేవగానే తీపి పదార్థాలు ఎక్కువగా తింటే వారు బరువు అనేది ఎక్కువగా పెరుగుతారు. కాబట్టి ఉదయమునే తీపి పదార్థాలు తినకుండా ఉండటం చాలా మంచిది. ఉదయమునే కూల్ డ్రింక్స్ లాంటివి తాగిన కానీ బరువు పెరుగుతారు. కాబట్టి ఉదయమునే లెగిచి అల్పాహారాన్ని తినండి. తద్వారా బరువు పెరగకుండా ఉంటారు.

## రాజా లాంటి ఆరోగ్యం కోసం రాజ్మా



రాజ్మా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో వున్నాయి. మధుమేహాన్ని తగ్గించి, బరువు కంట్రోల్లో పెడుతాయి. క్యాన్సర్‌తో పోరాడుతుంది. రాజ్మాలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి.ఇందులో ఫైబర్ ఉంటుంది. రాజ్మా జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది.రాజ్మాలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. రాజ్మా తీసుకోవటం వల్ల ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉంటుంది. దీని వల్ల అతిగా తినకుండా ఉంటాము. అలాగే బరువు తగ్గడానికి కూడా దోహదపడుతుంది. రాజ్మాలోని ఫైబర్ మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది.రాజ్మా గుండెకు కూడా మేలు చేస్తుంది. రాజ్మాలో ఫోలేట్ అనే పోషకం ఎక్కువగా ఉంటుంది. ఇది హొమోసిస్టైన్ అనే హానికరమైన అణువుల స్థాయిని తగ్గించడానికి సహాయపడుతుంది. రాజ్మాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిని నెమ్మదిగా పెంచుతుంది. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఇది చాలా మంచి ఆహారం.రాజ్మాలో కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా ఉంచడంలో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులను నిరోధించడానికి సహాయపడతాయి. రాజ్మాలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంపై ముడతలు పడకుండా తగ్గిస్తుంది.రాజ్మాను వివిధ రకాల వంటకాలలో ఉపయోగించి రుచికరమైన భోజనాలు తయారు చేసుకోవచ్చు. ఇది మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పప్పుధాన్యం. రాజ్మా ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఒక ఆహారం. అయితే, ఏ ఆహారాన్ని అయినా మితంగా తీసుకోవడం మంచిది. ఏదైనా ఆహారం మీ ఆహారంలో చేర్చే ముందు వైద్యుని సలహా తీసుకోవడం మంచిది.

# ఆఫీసులో గంటల తరబడి కూర్చుంటున్నారా



ప్రస్తుతం కొంత మంది శారీరక శ్రమ చేసే ఉద్యోగం కంటే ఆఫీసులో ఒకే చోట కూర్చొని పని చేస్తూ ఎక్కువ సమయం గడుపుతున్నారు. కొంత మందికి తమ డెస్క్ నుంచి లేవడానికి లేదా కాసేపు అటూ ఇటూ నడవడానికి కూడా సమయం దొరకదు.అయితే ఇలాంటి వ్యక్తుల ఆరోగ్యానికి కాలక్రమంలో హానికరంగా మారుతుంది. ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం వల్ల శరీర చురుకుదనం తగ్గుతుంది. అంతేకాదు కండరాలు, ఎముకల బలహీనతకు దారితీస్తుంది. అలాగే ఊబకాయం, అనేక సమస్యల ప్రమాదం పెరుగుతుంది.రోజూ గంటల తరబడి ఒకే చోట కూర్చొని ల్యాప్‌టాప్‌పై పని చేయడం వల్ల వెన్ను, మెడ, భుజాలపై నొప్పి వస్తుంది. పేలవమైన భంగిమ సమస్య కూడా ఏర్పడవచ్చు. అంతేకాదు ఇది మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో ఈ సమస్యలను నివారించడానికి ఇటువంటి వారు రోజులో కొంత సమయం కేటాయించి యోగా చేయవచ్చు. యోగా చేయడం వల్ల శరీరంలో ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. కండరాల బలం మెరుగుపడుతుంది. ఎముకలు బలపడతాయి. అంతేకాదు బరువును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అలాగే యోగా మానసిక ఆరోగ్యానికి, శారీరక ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో ప్రతిరోజూ ఈ సులభమైన యోగా ఆసనాలను చేయడం వలన అనేక ప్రయోజనాలుంటాయి.

తడసానాను పర్వత భంగిమ అని కూడా అంటారు. వెన్నెముకకు ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా శరీర భంగిమను మెరుగుపరచడంలో, అదనపు బొడ్డు కొవ్వును తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. ఈ యోగా ఆసనం చేయడానికి ముందుగా జాగ్రత్తగా నిటారుగా నిలబడండి. తర్వాత మీ రెండు చేతులను తలపైకి తీసుకుని, రెండు చేతుల వేళ్లను ఒక్కటిగా జత చేసి ఆ చేతులను నిటారుగా ఉంచాలి. దీని తరువాత కాళ్ల మడమలను ఎత్తండి. కాలి మీద నిలబడటానికి ప్రయత్నించండి. భుజంగాసనాన్ని కోబ్రా పోజ్ అని కూడా అంటారు. ఈ ఆసనంలో శరీరం పాములా తయారవుతుంది కనుక దీనిని భుజంగాసనం అంటారు. ఈ యోగా ఆసనం వెన్ను కండరాలను బలోపేతం చేయడంలో, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల వచ్చే తిమ్మిరిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా మీ కడుపుపై యోగా చాప మీద పడుకోండి. అరికాళ్లను పైకి ఉంచాలి. ఇప్పుడు మీ చేతులను ఛాతీ దగ్గరకు తీసుకొని అరచేతులను క్రిందికి ఉంచండి. దీని తరువాత దీర్ఘ శ్వాస తీసుకోండి. నాభిని పైకి ఎత్తండి. తల.. మెడను పైకి ఎత్తండి. దీని తర్వాత నెమ్మదిగా ఛాతీ.. కడుపుని ఎత్తండి. మీరు ఆకాశం వైపు లేదా పైకప్పు వైపు చూస్తున్నట్లు 5 నుండి 10 సెకన్ల వరకు ఈ భంగిమలో ఉండాలి.

వజ్రాసనం ఉదర అవయవాల పని తీరుని మెరుగు పరుస్తుంది. జీర్ణవ్యవస్థకు మంచిది. ఈ ఆసనం వేయడానికి మీ మోకాళ్ళను వంచి, మీ కాలి వేళ్ళపై కూర్చోండి .. రెండు పాదాల కాలి వేళ్ళను కలపండి. మడమల మధ్య కొంత దూరం ఉండాలని గుర్తుంచుకోండి. శరీరం మొత్తం బరువును పాదాలపై ఉంచండి .. రెండు చేతులను తొడలపై ఉంచండి.. ఈ సమయంలో నడుము పైన భాగం ఖచ్చితంగా నిటారుగా ఉండాలని గుర్తుంచుకోండి.

# ముంపు బాధితులను ఆసుకునేందుకు ఎంతైనా ఖర్చు చేస్తాం

**ప్రజలంతా మన బిడ్డలే**
**వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని**
**అధికారులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు**

**ఖమ్మం :** ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోంది. తాజాగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజప్రభుత్వం ప్రజల కోసం 24చీ7 అందుబాటులో ఉంది. ప్రజల సమస్యలు తీర్చేందుకు నిరంతరం తపిస్తోంది. ఖమ్మం జిల్లాలో ఆదివారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మరోసారి మున్నేరువాగు నగరాన్ని ముంచెత్తే ప్రమాదకర పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హుటాహుటిన ఖమ్మం నగరానికి బయలుదేరారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తవచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి ఖమ్మం బయలు దేరారు. దారి మొత్తం కుంభవృష్టి కురుస్తున్న పరిస్థితుల మధ్య ప్రజా సంక్షేమం తప్ప మరేమీ పట్టించుకోకుండా భట్టి విక్రమార్క రాత్రి 11.30 గంటల సమయంలో ఖమ్మం చేరుకున్నారు. వెంటనే వరద ముంపు ప్రభావిత ప్రాంతమైన కాలువొడ్డు చేరుకుని అక్కడ ప్రజలతో మాట్లాడారు. వరద ముంపు అధికంగా ఉండడంతో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు లేదంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అనంతరం కాలవొడ్డు వద్ద మున్నేరు బ్రిడ్జి దగ్గర వరదను పరిశీలించారు. అక్కడనుంచి ఖమ్మం పట్టణంలో మరోసారి మున్నేరు వాగు వరద ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో స్వర్ణ భారతి పునరావాస శిబిరంలో వరద ముంపు బాధితులని పరామర్శించారు. పునరావాసకేంద్రంలో ఉంటున్న బొక్కల గడ్డకు చెందిన వందకు పైగా కుటుంబాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి



విక్రమార్క స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయసహకారాలపై వరదబాధితులతో మాట్లాడారు. భోజన ఏర్పాట్లు వైద్య పరమైన అంశాలను పర్యవేక్షించారు. బాధితులకు దుప్పట్లు తదితర సౌకర్యాలు కల్పించాలి అని అధికారులను ఆదేశంచారు. అక్కడనుంచి వరద ముంపు బాధితుల కోసం ఖమ్మం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పునరాదశ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధితులకి సమయానికి ఆహారం, అనారోగ్యం ఏర్పడితే అందిస్తున్న వైద్య సేవలు గురించి బాధితులతో మాట్లడారు. అక్కడే ఉంటున్న బొక్కల గడ్డ ప్రాంతానికి చెందిన మరో యాభై కుటుంబాల ను పరామర్శించి ఏర్పాట్ల గురించి అడిగారు.

అర్థారాత్రి 1 గంట సమయంలో ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని అర్ధరాత్రి రాత్రి పొద్దు పోయాక పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధితుల వద్దకు వెళ్లి వారితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వారికి అందుతున్న ఆహారం, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్న అనారోగ్యం వచ్చిన అధికారులు తక్షణం స్పందించి తమకు మందులు అందిస్తున్నారని బాధితులు ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రానికి స్వయంగా తరలిస్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. పై జిల్లాల లో ఇంకా వర్షాలు తగ్గలేదు.. మున్నేరు కాలవకు క్రమక్రమంగా వరద పెరుగుతుంది.. ఈ నేపథ్యంలో కాబట్టి ముందస్తుగా మున్నేరువాగు చుట్టుపక్కల ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీగా కురుస్తున్న వర్షాలకు ముంపు బాధితులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం మాత్రమే పనిచేస్తుందని అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు మన బిడ్డలేనన వారిని ఆదుకోవడం ప్రభుత్వ కర్తవ్యం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక వైద్య, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటంతో బీజేపీకి సంబంధం లేదు

**హైదరాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గది. కానీ, నేడు ఈ చరిత్రకు సంబంధంలేని మతోన్మాద శక్తులు వాస్తవికతను వక్రీకరిస్తూ హిందు, ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తున్నారు. మత చాందసవాదులు కుట్రలను వక్రీకరణను తిప్పికొడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాస్తవికత చరిత్రను ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి తెలంగాణను లౌకిక ప్రజాస్వామ్యం వైపు నడిపించాలని సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నాలుగు భాషలు ముద్రించి ప్రచురించిన బుక్లెట్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట సేనాని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు,



ప్రజాపీడకులైన దొరలు, దేశముఖ్ లకు మధ్య జరిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ మతం రంగు అద్దుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవిక గాథ నేటి యువతరానికి తెలియాల్సి ఉంది. వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. మహిళలపై అఘాయిత్యాలు జరిగేవి మాట వినకపోతే క్రూరమైన శిక్షలు విధించేవారు. ఈ కష్టాల కడలి నుంచి బయటపడాలని ఆలోచిస్తున్న క్రమంలో ఆంధ్రమహాసభ ఉద్యమం ప్రారంభమైందన్నారు. కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేసి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని నిర్మించింది. రైతుల పంటలను భూస్వాములు లాక్కుంటున్న తరుణంలో ప్రజలు తిరగబడ్డారు. చేతికి దొరికిన ఆయుధంతో దొరల గూండాలను తరిమి కొట్టారు. అనంతరం 1947 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు బందూకులు చేతబట్టి దొరలను గడగడలాడించారు. ఇలాంటి మహత్తరమైన సాయుధ పోరాట చరిత్రను అభాసుపాలు చేసి వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధిని పొందాలని బీజేపీ చూస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ మోసపూరితమైన కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి. సెప్టెంబర్ 11-17 మధ్య తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందామన్నారు.

## మంత్రులు కిషన్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అడ్డుకున్న వరద బాధితులు




**హైదరాబాద్ :** ఖమ్మం జిల్లాలో వరద భాదితులను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రులు కిషన్ రెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తీవ్ర నిరసన సెగ ఎదురైంది. ఆదివారం ఖమ్మం జిల్లా దంసలాపురంలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మరో మంత్రి పొంగులేటి కారును వరద బాధితులు అడ్డుకున్నారు. వర్షాలకు సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డామని, తమకు ఎలాంటి సహాయం అందలేదని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి ఎలాంటి సహాయం అందలేదని, తమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారి వెంట ఉన్న ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు. కాగా, ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి ఖమ్మం జిల్లాలోని మున్నేరుకు వరద ఉధృతి పెరిగింది. ప్రస్తుతం వరద ప్రవాహం 16 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 24 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో వరద ప్రభావిత కాలనీల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతం డేంజర్ జోన్‌లో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి మళ్లీ వరద వచ్చే అవకాశం ఉంది. దీంతో రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లన్నీ బ్లాక్ చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్య

**హైదరాబాద్ :** నిన్న మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకున్న సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్య అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన అంశంపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ రోజు ఈ సమావేశం కొంత బాధతో దుఖంతో పెడుతున్న ప్రెస్ కాన్ఫరెన్స్. రైతు రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వం చేస్తున్న వంచన, దుర్మార్గ పద్ధతులపై, అన్నదాతల పట్ల ఆవేదనతో మాట్లాడుతున్నాను. నిన్న రైతు సురేందర్ రెడ్డి రుణమాఫీ జరగలేదని ఆత్మహత్య చేసుకున్నారు. మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకున్నాడు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతుల పాలిట యమపాశంగా మారింది. దానికి సాక్ష్యం సురేంద్ రెడ్డి ఆత్మహత్య. ఆయన తన సూసైడ్ నోట్‌లో స్పష్టంగా రాశారు. బ్యాంక్ పాస్ బుక్ మీదనే సూసైడ్ నోట్ రాశారు. నా చావుకు కారణం క్రాప్ లోన్ మాఫీ కాకపోవడం. నా చావుకు కారణం క్రాప్ లోన్ చిచ్చు. సురేందర్ రెడ్డితో పాటు ఆయన తల్లి.. ఇద్దరు ఒకే రేషన్ కార్డులో ఉండడం వల్ల రుణమాఫీ కావడం లేదు. ఇద్దరికి క్రాప్ లోన్ ఉంది. రేషన్ కార్డు ఒకటే ఉండడంతో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని అన్నారట బ్యాంక్ మేనేజర్. దాంతో తీవ్ర కలత చెంది సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని హరీశ్‌రావు తెలిపారు. సురేందర్ రెడ్డి తల్లి సుశీల పేరు మీద 2 ఎకరాల పాస్ బుక్ ఉంది. ఆమెకు రూ. 1,15,662 లోన్ ఉంది. సురేందర్ రెడ్డికి 4 ఎకరాలు.. ఆయన పాస్ బుక్ మీద రూ. 1,92,443 రుణం ఉంది. నాలుగు రోజుల క్రింత ఏపీజీవీబీ బ్యాంక్ వెళ్లి రుణమాఫీ ఎందుకు కాలేదని మేనేజర్‌ను అడిగారు. ఒకే రేషన్ కార్డు ఉండడంతో ఒక్కరికి రుణం మాఫీ అవుతుంది. ఇద్దరికి కలిపి 2 లక్షలు మాఫీ అవుతుంది. మిగతా రుణం చెల్లించాలని బ్యాంక్ మేనేజర్ అనిరుధ్ సురేందర్ రెడ్డికి



చెప్పారట. దాంతో మానసికంగా కలత చెందిన సురేందర్ లక్షా 10 వేలు కట్టాలని కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. చివరకు మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకుని చనిపోయారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ సూసైడ్ నోట్ సాక్షిగా రేవంత్ రెడ్డిని అడుగుతున్నా.. పంద్రాగస్టు నాడు రుణమాఫీ అయిపోయిందని చెప్పావు..? అయిపోతే సురేందర్ రెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు. మీరే చెప్పారు కదా రేషన్ కార్డుతో లింక్ లేదని. రుణమాఫీ గైడ్ లైన్స్ వచ్చిన రోజే అసెంబ్లీలో ప్రెస్ మీట్ పెడితే.. రేషన్ కార్డుతో లింక్ లేదని కొద్ది గంటలకు చెప్పారు. కానీ లింక్ ఉన్నది.. కాబట్టే బ్యాంక్ మేనేజర్లు రేషన్ కార్డు ప్రకారం రుణమాఫీ చేశారు. అందుకే సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని స్పష్టమవుతుంది. రుణమాఫీ లబ్దిదారులను ఆంక్షల పేరుతో వేధిస్తున్నవ్. నీవు పన్నిన పన్నాగం రైతుల మెడకు ఉరి తాడైంది. రాజకీయంగా బ్లఫ్ చేద్దామనుకున్నావ్.. నీ బ్లఫ్‌కు మూల్యం సురేందర్ రెడ్డి మరణం. సురేందర్ రెడ్డి నోట్‌లో ప్రతి అక్షరం నీ దురాగాతన్ని, నీ రాజకీయ దివాళకోరుతనాన్ని, నీ నగ్న స్వరూపాన్ని ఇవాళ బజారులో నిలబెట్టిందని చెప్పక తప్పదు. ఈ సూసైడ్ నోట్ నీ దుష్ట పాలన మీద తెలంగాణ రైతులు రాసిన పంచనామా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## ఇది కష్ట సమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆదేశాలతో మిమ్మల్ని కలవడానికి మిమ్మల్ని పరామర్శించి ఇక్కడ పరిస్థితుల్ని పరిశీలించడానికి వచ్చాను. రాకాసితండా ప్రజలు వరద కారణంగా సర్వస్వం కోల్పోయారు నిరాశ్రయులుగా మిగిలారు. పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి పొలాలన్నీ ఇసుక మేటలుగా గా మారాయి. ఈ కష్ట సమయంలో ఈ గ్రామస్తులకు అండగా నిలవలసిన అవసరం ఉంది గ్రామస్తులు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు . ప్రజల కోరిక మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరి ఆమోదం మేరకు రాకాసితండాను సురక్షిత ప్రాంతానికి మార్చే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పంట పొలాల్లో ఇసుక మేటను తొలగించి ఆర్థిక సాయం అందించి రైతులు సాగు చేసుకునే విధంగా చేయాలి. ఇది కష్ట సమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరద బాధితులకు అండగా ఉంటాయి.. మిమ్మల్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వాలు తీసుకుంటాయని అన్నారు

## కారులో మంటలు

**నల్గొండ :** నల్లగొండ జిల్లా పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ కార్ లొ అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. చిట్యాల సమీపంలోని జియో బంకు దగ్గర కారు ఇంజిన్ లోంచి పొగలు రావడంతో.. అందులో ప్రయాణిస్తున్న వారు వెంటనే కారు రోడ్డు పక్కన ఆపేసి.. ప్రాణాలకు అరచేతిలో పెట్టుకొని బయటికి పరుగులు తీశారు. వారి కళ్ళ ముందే కారు కాలిపోతునీడటంతో నిశ్చయస్టులై నిలుచున్నారు. కారులో బ్యాటరీ లేదంటే ఇంజిన్ సమస్య కారణంగా మంటలు తలెత్తి ఉండొచ్చని తెలుస్తుంది. టాటా కంపెనీకి చెందిన బోల్ట్ కారు కావడం గమనార్హం. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. వచ్చి కారులో తలెత్తిన మంటలను ఆర్పేశారు. అప్పటికి కారు దాదాపు సగభాగం పూర్తిగా దగ్ధమైంది.

## హైడ్రా కూల్చివేతల దూకుడు

**హైదరాబాద్ :** హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేతలు శరవేగంగా జరుగుకున్నాయి.. దుండిగల్ మున్సిపాలిటీ పరిదిలోని కత్వ చెరువులో 170/1సర్వే నెంబర్ లో వెలిసిన 8విల్లాలను నేలమట్టం చేస్తున్నారు హైడ్రా అధికారులు .. మల్లంపేట్ కత్వ చెరువు ఎఫ్టిఎల్ విస్తీర్ణం 142 ఎకరాలు మల్లంపేట్ లో లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ పేరుతో 2020-21 సంవత్సరానికే 320విల్లాస్ లను కన్స్ట్రక్షన్ చేసింది ఈ సంస్థ..అప్పటికే 60విల్లాలకు మాత్రమే ఊఓఆం పర్మిషన్ తీసుకున్న ఈ సంస్థ మిగతావన్నింటిని పోర్జరీ పర్మిషన్ తో కన్స్ట్రక్షన్ చేసిందన్న ఆరోపణలతో అప్పటి మేడ్చల్ కలెక్టర్ హరీష్ నేతృత్వంలో డిపిఓ ఆద్వర్యంలో ఎంక్వైరీ చేసి 208విల్లాలకు ఇల్లీగల్ కన్స్ట్రక్షన్ అని నోటీసులు జారీచేసి సీజ్ చేశారు..హై కోర్ట్ ఆదేశాలతో ఈ అక్రమవిల్లాలకు కరెంట్ కనెక్షన్,వాటర్ కనెక్షన్,రిజిస్ట్రేషన్ లను ఆపాలని,బ్యాంక్ అధికారులు లోన్ లను నిలిపి వెయ్యాలని ఆర్డినెన్స్ జారీచేశారు..చట్టంలో ఉన్న లొసుగులతో దుండిగల్ మున్సిపాలిటీ అధికారుల ధనదాహానికి అక్రమ విల్లాలన్ని సక్రమవిల్లాలుగా మారిపోయాయి..పర్మిషన్ తో సంబంధం లేకుండా ఇంటినెంబర్ ల ఆధారంగా,డబుల్ పన్ను విధించి కుడా రిజిస్ట్రేషన్ లు చేయొచ్చనే కొత్త ఒరవడిని దుండిగల్ మున్సిపాలిటీ తీస్కొచ్చి రిజిస్టేషన్ లు చేసింది..ఏదిఏమైన హైడ్రా రంగంలోకి దిగి గత ఆదివారం ఈ కత్వ చెరువును విజిట్ చేసి ఈరోజు ఎఫ్టిఎల్ ఉన్న 3విల్లాలు,బఫర్ లో ఉన్న 5విల్లాలను నేలమట్టం చేశారు

## వరదల విషయంలో పూర్తి వైఫల్యం

**హామీల అమలులొఓ అట్టర్ ప్లాప్**

**నల్లగొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం వరద సాయం, రుణమాఫీ అమలుపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. పరిపాలన, వరదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. హామీల అమలులో అట్టర్ ప్లాప్. రైతు రుణమాఫీలో అంతా గందరగోళం. ఇంతవరకూ.. 10 వేల కోట్లు మాఫీ కాలేదు. రుణమాఫీపై వ్యవసాయ మంత్రి, ఇతర మంత్రుల మాటలు అయోమయానికి దారి తీస్తున్నాయి. మళ్ళీ 2014 ముందు లాంటి విద్యుత్ కష్టాలు మొదలైయ్యాయి. మంత్రులు పరిపాలన గాలికి వదిలేసి.. వ్యక్తిగత సంపాదనలో పడ్డారు. హామీలు నమ్మి రైతులు ఓట్లు వేస్తే.. కుచ్చుటోపీ పెట్టి మోసం చేస్తున్నారు. అసలు ఋణామాఫీ చేసే ఆలోచన ఉందా..? లేదా..? వ్యవసాయ మంత్రి సమాధానం చెప్పాలి. వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. వరదలపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదు. వరద బాధితుల ఇళ్లకు పోయే దమ్ము మంత్రులకు ఉందా..? 2లక్షలకు పైనున్న డబ్బు మాఫీ చేయాలని.. రుణమాఫీపై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేసారు.

## టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్‌కి ఎంపి చామల శుభాకాంక్షలు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ని హైదరాబాద్ లోని వారి నివాసంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. టీపీసీసీ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. అయనతోపాటు టిపిసిసి మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## సెన్సేషనల్ కంపెనీ సరుకుల వితరణ


**డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లె పల్లి గ్రామంలో ముంపు బాధిత కుటుంబ సభ్యుల కు సెన్సేనల్ గ్రూప్ ఆఫ్ కంపనీ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. మరిపెడ సీఐ రాజ్ కుమార్ ఈ కార్యక్రమానికి హాజరయ్యి అందచేసారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ముంపు బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలనే ఆలోచన ఓ కంపెనీకి రావడం అభినందనీయం అన్నారు..మరింత మందికి తమ సేవ గుణం తో సహాయం అందచేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు

## విద్యుత్ ఘాతంలో వినాయక విగ్రహం దగ్ధం

**హైదరాబాద్ :** అంతా ఒక్క క్షణంలోనే ముగిసిపోయింది. దిల్షుక్ నగర్ లోని పి అండ్ టీ కాలనీలో ప్రతి సంవత్సరం ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈసారి అదే విధంగా నిర్వహించే క్రమంలో కొత్తగా పత్తి తో డెకరేషన్ చేశారు అంతా పూర్తయింది అనుకునే లోపు మెయిన్ స్విచ్ ఆన్ చేసే మరో సెకండ్ కె ఒక్కసారిగా షాక్ సర్క్యూట్ తగిలి విద్యుత్ ఘాతుకానికి కాలి బూడిద అయిపోయింది , దైవ అనుగ్రహం ఉండడం వల్ల ఏ ఒక్కరికి కూడా చిన్న గాయం కాలేదు అప్పుడే ఐదు నిమిషాల ముందు మండపం వద్ద ఉన్న చిన్నారులు అందరు తమ ఇంటికి వెళ్ళారు , అల వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇలా జరిగిపోయింది మండపం వద్ద చిన్నారులంతా కన్నీరు మున్నీరయ్యారు.

## మున్నేరు ప్రవాహ ప్రాంత ప్రజల్లో భయం భయం

**జగ్గయ్యపేట :** మున్నేరుకు గంట గంటకు పెరుగుతున్న వరద ప్రవాహం తో స్థానిక ప్రజలు భయాందోళనలో వున్నారు. వత్సవాయి మండలం పోలంపల్లి డ్యామ్ వద్ద 13 అడుగుల మేర వరద ప్రవాహం ప్రవహిస్తోంది. మరో రెండు అడుగులు వరద ప్రవాహం పెరిగితే పెనుగంచిప్రోలు మున్నేరు బ్రిడ్జి పై నుంచి వరద ప్రవహించే అవకాశం వుంది. దాంతో రాత్రికి రాత్రే అధికారులు అప్రమత్తం ముప్పు ప్రాంత ప్రజలను ఖాళీ చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. శనివారం న్న మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. ఎగువున కురుస్తున్న వర్షాలకు మున్నేరుకు వరద ప్రవాహం పెరగడంతో మున్నేరు ప్రవాహ ప్రాంత ప్రజలు ను అధికారులు అప్రమత్తం చేశారు. వత్సవాయి మండలం పెనుగంచిప్రోలు మండలం నందిగామ మండలంలోని పలు గ్రామాలు లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు . ఖమ్మంలో కురుస్తున్న వర్షం కు అక్కడి అధికారులు అప్రమత్తం అవడంతో ఇక్కడ అధికారులు ముందస్తుగా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గత వారం రోజుల క్రితమే వరద ఉధృతి పెరిగి తగ్గడంతో మరోసారి వరదరావడంతో ప్రజలు భయాందోళనలు నెలకొన్నాయి.




# రిలీజ్‌కు ముందే రికార్డు..

## ఓవర్సీస్ ప్రీసేల్‌లో దుమ్మురేపుతున్న 'దేవర'

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గరపడటంతో ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుక్ స్టార్ట్ చేశారు మేకర్స్. అయితే అటు అడ్వాన్స్ బుక్ స్టార్ట్ చేశారో లేదో ప్రీసేల్‌లో 5 లక్షల టికెట్లు బుక్ అయినట్లు టీమ్ ప్రకటించింది. ఇక అమెరికాతో పాటు కెనడాలో కూడా ఈ సినిమా సత్తా చాటుతున్నట్లు చిత్రబృందం తెలపింది. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న విడుదల చేయనున్నట్లు దేవర టీం ప్రకటించింది. ఈ ట్రైలర్ ఈవెంట్‌ను ముంబైలో భారీ ఎత్తున్న ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.

# ఫన్ ఎంటర్‌టైనర్‌గా 'మత్తు వదలరా 2' ట్రైలర్

స్వర మాంత్రికుడు ఎమ్.ఎమ్ కీరవాణి తనయుడు శ్రీ సింహా, కమెడియన్ సత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. బ్లాక్ బస్టర్ మూవీ 'మత్తు వదలరా'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకత్వం వహిస్తున్నాడు. క్రైం కామెడీ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాలో జాతి రత్నాలు ఫేం ఫరియా అబ్దుల్లా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాను సెప్టెంబర్ 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. కామెడీతో యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మరోవైపు ఈ సినిమా సెన్సార్ కూడా కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చినట్లు చిత్రబృందం ప్రకటించింది.






# వినాయకచవితి స్పెషల్‌గా వచ్చిన 'కుబేర' పోస్టర్ వైరల్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ టాలీవుడ్ కింగ్ నాగార్జున నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న మోస్ట్-వెయిటెడ్ పాన్ ఇండియా మూవీ 'కుబేర' ఈ సినిమాకు సంబంధించిన లీడ్ రోల్స్‌తో సహా రష్మిక మందన్న పాత్రని పరిచయం చేసిన పోస్టర్లు, గ్లింప్స్ హ్యూజ్ రెస్పాన్స్‌ను రాబట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా ధనుష్, నాగార్జునలను ఒకే పోస్టర్ ద్వారా చూపిస్తూ.. యూనిట్ వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్ ఈ సినిమాలో ధనుష్, నాగార్జున పోషించిన పాత్రల మధ్య ఉన్న తేడాను చూపిస్తుంది. ధనుష్ పాత్ర మ్యాసీ హెయిర్, గుబురు గడ్డంతో కనిపించగా.. నాగార్జున లుక్ మోడరన్ అవుట్ ఫిట్స్‌లో స్టయిలీష్ అవతార్‌లో ఉంది. ఈ పోస్టర్ 'కుబేర' సినిమా థీం కోర్‌ని ప్రజెంట్ చేస్తోంది. పోస్టర్‌లో చూపించిన డబ్బు కట్టలు, దాని మ్యాప్ ఇమేజ్ మొత్తం కూడా ఓ వైవిధ్యభరిత సినిమాను శేఖర్ కమ్ముల ప్రేక్షకులకు ఇవ్వబోతున్నారనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ఇందులో జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్ పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో మల్టీలింగ్వల్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది.




# ఓటీటీలోకి రాబోతున్న 'ఆయ్'

గీతా ఆర్ట్స్2 పిక్చర్స్ బ్యానర్ పై బన్నీ వాసు నిర్మాణంలో తెరకెక్కిన తాజా చిత్రం ఆయ్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అంజి కంచిపల్లి దర్శకత్వం వహించాడు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా.. రూ.15 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా సెప్టెంబర్ 12 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు కార్తీక్ (నార్నె నితిన్). కరోనా వలన లాక్ డౌన్ రావడంతో తన సోంతఊరు అయిన అమలాపురం వస్తాడు. అయితే అమలాపురంలో వర్క్ ఫ్రం హోమ్ చేసుకుంటునే తన చిన్ననాటి ఫ్రెండ్స్ అయిన హరి(అంకిత్ కోయ), సుబ్బు(రాజ్ కుమార్ కసిరెడ్డి)తో కలిసి సరదాగా గడుపుతుంటాడు. అయితే అదే ఊరిలో ఉన్న పల్లవి (నయన్ సారిక)ని చూసి ఫస్ట్ లుక్‌లోనే ఇష్టం పెంచుకుంటాడు. అయితే ఊరులో ఉండే పల్లవికి సోషల్ మీడియాలో చలాకీగా ఉండడంతో పాటు కులం పట్టింపులు ఎక్కువ. అయితే కార్తీక్ తన కులం వాడే అనుకుని లవ్ చేస్తుంది. అయితే కార్తీక్ కులం వేరని తెలిసిన పల్లవి తన తండ్రి (మైమ్ గోపి) అతడిని చంపేస్తాడని దూరం పెడుతుంది. ఈ క్రమంలో కార్తీక్ ఏం చేస్తాడు. పల్లవి, కార్తీక్‌ల ప్రేమను పల్లవి తండ్రి ఒప్పుకుంటాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110